Source:- Eenadu Telugu Newspaper
Date:- October 28, 2018



# 102 కిలోల బంగారం పట్టివేత

- దేశవ్యాప్తంగా అక్రమ రవాణాపై అధికారుల కొరడా
- ఒక్క సిలిగుడిలోనే 55 కిలోల స్వర్ణం స్వాధీనం

దిల్లీ: బంగారం అక్రమ రవాణా కార్యకలాపాలపై డైరెక్టొరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) కొరడా ఝుళిపిస్తోంది. దేశవ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల్లో గత రెండు రోజుల్లోనే ఏకంగా 102 కిలోల బంగారాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం ఏడుగుర్ని అరెస్టు చేశారు. పశ్చిమ్‌బంగలోని సిలిగుడి సమీపంలో శుక్రవారం ఓ వాహనాన్ని అడ్డగించిన డీఆర్ఐ అధికారులు.. అందులో అక్రమంగా తరలిస్తున్న 55 బంగారు కడ్డీలను స్వాధీనం చేసుకున్నారు. సదరు కడ్డీలు చైనా, ఆస్ట్రేలియాలో తయారైనట్లు గుర్తులున్నాయని వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. మరో ఘటనలో, దిల్లీ రైల్వే స్టేషన్‌లో శనివారం 34 కేజీల బంగారు కడ్డీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఓ విదేశీయుడితో సహా మొత్తం ముగ్గురు వ్యక్తులను అక్కడ అరెస్టు చేశారు. స్వర్ణ కడ్డీలపై చైనా, స్విట్జర్లాండ్‌ల్లో అవి తయారైనట్లు గుర్తులున్నాయని అధికారులు వెల్లడించారు. చెన్నై, బెంగళూరు, మదురై, ఇండోర్ విమానాశ్రయాల్లో 18 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.